క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్ ఉన్నత పాఠశాలకు చెందిన బాస్కెట్ బాల్ జట్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ అజయ్‌కుమార్ తెలిపారు. జగిత్యాల జిల్లా లక్ష్మీపూర్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో నిజామాబాద్ పాఠశాలకు చెందిన జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. వీరిలో రోహిత్, వీనస్, జైస్వాల్, రియానా, జస్విక రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికకాగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు షాబొద్దీన్, సెక్రెటరీ నర్రా శ్రీనివాస్‌రెడ్డి తదితరులు అభినందించారు. వారి వెంట పీడీ అజయ్‌కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

రాజన్న సేవలో దత్తగిరి మహారాజ్



వేములవాడ: వేములవాడ రాజన్నను బర్దిపూర్ (సంగారెడ్డి జిల్లా)కు చెందిన దత్తగిరి మహారాజ్ శనివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని ఆలయ అధికారులు మహారాజ్ అందజేశారు. ప్రోటోకాల్ ఏఈవో అశోక్‌కుమార్, ఆలయ పర్యవేక్షకుడు నునుగొండ రాజేందర్, ఆలయ అర్చకులు, వేద పండితులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

‘రసమయి ఇంటిపై దాడి సరికాదు’

ఇల్లంతకుంట: మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఇంటిపై కాంగ్రెస్ నాయకుల దాడి సరికాదని జిల్లా జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాపాలనలో కాంగ్రెస్ నాయకులు గుండాగిరీ చేస్తున్నారన్నారు. ఇలాంటివి మళ్లీ పునరావృతం కాకుండా కాంగ్రెస్ నాయకులు మానుకోవాలని ఆయన హితవు పలికారు.

బంద్‌కు బీఆర్‌ఎస్, బీజేపీల మద్దతు హాస్యాస్పదం

ఇల్లంతకుంట: బీసీ బంద్‌కు బీఆర్‌ఎస్, బీజేపీలు మద్దతు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని జిల్లా కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ కడగండ్ల తిరుపతి ఆరోపించారు. మండలకేంద్రంలో ఆయన శనివారం మాట్లాడారు. రెండు పార్టీలు బంద్‌లో పాల్గొనడం సవతి తల్లి ప్రేమలాంటిదన్నారు. బీసీలను మభ్యపెట్టేందుకు బీజేపీ, బీఆర్‌ఎస్ నాటకం ఆడుతున్నాయని ఆయన ఆరోపించారు.

కేంద్రీయ విద్యాలయం ఎదుట ధర్నా



ధర్నాచేస్తున్న బీసీ నాయకులు

తంగళ్లపల్లి: రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలని బీసీ సంఘాల నాయకులు కందుకూరి రామాగౌడ్, ఎగుర్ల కరుణాకర్ అన్నారు. శనివారం మండలంలో బంద్ నిర్వహించి పద్మనగర్ కేంద్రీయ విద్యాలయం బంద్‌కు సహకరించాలని గేటు ముందు ధర్నా చేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు గజభీంకార్ సంతోష్, ఎగుర్ల ప్రశాంత్, మైనారిటీ నాయకుడు ఎండీ.హమీద్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల కోసం ఒత్తిడి తేవాలి

ఎల్లారెడ్డిపేట: బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి అన్నారు. శనివారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు బీసీ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చి 52 శాతం ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. తమ పార్టీ తరఫున బీసీలకు మద్దతు ప్రకటించడమే కాకుండా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. సమావేశంలో నాయకులు మీసం రాజం, ఎడ్ల సందీప్, సింగారం దేవరాజు, పిల్లికిషన్, బట్టురాజు, శ్రీనివాస్, రామభీమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ఫిల్టర్ వితరణ

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక ప్రైమరీ పాఠశాలకు గ్రామానికి చెందిన తడిగొప్పుల విజయ మురళి దంపతులు రూ.20 వేల విలువైన ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్‌ను శనివారం వితరణగా అందించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రవణ్‌కుమార్, హైస్కూల్, పీఎస్ హెచ్‌ఎంలు ఉషారాణి, రవి, సురేందర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్లు, తదితరులు ఉన్నారు.





మార్కెట్‌కు దీపావళి శోభ



- వెరైటీల్లో ప్రమిదల అమ్మకాలు
- పట్టణంలో మొదలైన వెలుగుల పండుగ
- చిరు వ్యాపారులకు సీజనల్ ఉపాధి

సండే స్పెషల్

సిరిసిల్లటౌన్: దీపావళి పండుగ సందర్భంగా వెరైటీ డిజైన్లలో తయారు చేసిన ప్రమిదలను మార్కెట్ ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. పట్టణ మార్కెట్‌ను మట్టి దీపాలు ముంచెత్తాయి. మట్టితో తయారయ్యే అందమైన ప్రమిదలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన మట్టి దివ్వెలకు క్రేజ్ పెరిగింది. దీంతో మట్టితో పాత్రలు తయారు చేసే కుమ్మరులు, చిరు వ్యాపారులకు దీపావళి సీజన్‌లో కలిగే ఉపాధిపై సండే స్పెషల్ కథనం..

చిరు వ్యాపారులకు ఉపాధి

కార్తీకమాసంలో హిందువులు ఇంటిముందు దీపాలు వెలిగించడం ఆనవాయితీ. సంప్రదాయపరంగా మట్టితో తయారయ్యే ప్రమిదలనే ప్రజలు వెలిగిస్తారు. దీంతో మట్టి ప్రమిదలు తయారు చేసే కుమ్మరి కుల వృత్తులతో పాటు, ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసిన మట్టి దీపాలతో చిరు వ్యాపారులకు ఉపాధి లభిస్తోంది. నెల రోజులుగా పట్టణంలోని పది కుమ్మరుల కుటుంబాలు ప్రమిదలు, కంచులు, కుండల తయారీతో బిజీగా ఉంటున్నారు. జిల్లావ్యాప్తంగా ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, గంభీరావుపేట, తంగళ్లపల్లి, కోనరావుపేట, ఇల్లంతకుంట మండలాల నుంచి ప్రజలు పట్టణంలోని కుమ్మరుల వద్ద మట్టిపాత్రలు కొనుగోలు చేసేందుకు రావడంతో మార్కెట్‌లో సందడి నెలకొంది.

కోరిన డిజైన్లలో..

మట్టి ప్రమిదలను కోరే వినియోగదారులు అడిగిన డిజైన్లను కుమ్మరులు తయారు చేసి ఇస్తున్నారు. ప్రజలు ఆన్‌లైన్‌లో డిజైన్లను చూసి చెబితే వెంటనే ఆర్డర్ తీసుకొని వినియోగదారులకు అందిస్తున్నారు. దీపావళి నేపథ్యంలో సిరిసిల్లకు రాజస్థాన్, నాందేడ్, హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రమిదలను ప్రజలు పెద్దఎత్తున కొనుగోళ్లు చేస్తున్నారు. నీటిలో తేలియాడే ప్రమిదలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మట్టితో తయారు చేసిన ప్రమిదలు డజన్‌కు రూ.100 నుంచి రూ.500, ఫైబర్‌తో తయారైన ప్రమిదలు జతకు రూ.150 రేటును పలికాయి. పట్టణంలోని మార్కెట్, పెద్దబజార్, అంబేద్కర్ చౌరస్తా, పాతబస్టాండ్ ప్రాంతాల్లో ప్రమిదల కొనుగోళ్ల సందడిగా మారింది. దీపావళి రోజు ప్రతీ ఇంట్లో వెలిగించే దీపాలను తయారీదారులు వెరైటీ డిజైన్లలో తయారు చేశారు.

మట్టి దీపాలే వెలిగిస్తాం



కార్తీకమాసం వరకు ఇంటి ముందు మట్టి దీపాలు వెలిగిస్తాం. ఆన్‌లైన్‌లో లభించే ఆధునిక డిజైన్లలో దీపాలను స్థానికంగా అమ్ముతున్నారు. వాటి ధర కూడా అందుబాటులో ఉంది. మట్టితో తయారైన స్థానిక, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రమిదలు ఆకట్టుకుంటున్నాయి.

– ఒటారికారి లావణ్య, సిరిసిల్ల

ఆన్‌లైన్ డిజైన్లతో అమ్మకాలు



ఆన్‌లైన్ ద్వారా డిజైన్లను చూసి ఆర్డర్‌పై తీసుకొచ్చి అమ్ముతాం. కార్తీకమాసంలో మట్టి పాత్రలకు గిరాకీ ఉంటుంది. పదేళ్లుగా ప్రమిదలు విక్రయిస్తూ సీజనల్ ఉపాధి పొందుతున్నా. రాజస్థాన్, హైదరాబాద్ నుంచి వెరైటీ డిజైన్లలో ప్రమిదలు తీసుకొచ్చాం. మైనం దీపాలు కాకుండా మట్టి ప్రమిదలు, కుండలు వినియోగించడంతో ఉపాధి దొరుకుతుంది.

– గుర్రం సంధ్య, చిరువ్యాపారి

ఉపాధిహామీని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో సత్తయ్య

ఎల్లారెడ్డిపేట: ఉపాధి హామీ పనులను జాబ్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సత్తయ్య అన్నారు. మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కొత్త పనులు గుర్తించి వాటికి ఆర్థిక ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఉపాధి పనుల కోసం కేంద్రం అదనంగా నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఏపీవో కొమురయ్య, సిబ్బంది ప్రభాకర్, కోనేటి నరేశ్, కార్యదర్శి ప్రవీణ్, కూలీలు పాల్గొన్నారు.

వైకుంఠరథం అందజేత



అధికారులకు వైకుంఠరథం అందజేస్తున్న శ్రీనివాస్, రమేశ్

ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్‌కు చెందిన చేపూరి శ్రీనివాస్, రమేశ్ సోదరులు పంచాయతీ అధికారులకు వైకుంఠరథం అందజేశారు. చేపూరి ఎల్లవ్వ, రాజాగౌడ్ జ్ఞాపకార్థం రూ.2.50లక్షల విలువ చేసే వైకుంఠరథాన్ని అందించారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు మాట్లాడుతూ చేపూరి రాజాగౌడ్ గ్రామానికి నలభైఏళ్లుగా ఎన్నో సేవలు అందించారన్నారు. అనంతరం శ్రీనివాస్, రమేశ్‌ను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఇక్కడ మాజీ సర్పంచ్ మిర్యాల్‌కార్ శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షుడు క్రాంతికుమార్, వీడీసీ అధ్యక్షుడు నక్క దాసరి రవి, సతీశ్‌చందర్, పద్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్; విశ్వనాథం, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ విప్‌కు వినతి



విప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ కౌన్సిలర్లు

సిరిసిల్ల అర్బన్ : పట్టణంలోని విలీన గ్రామాల రైతులకు ధాన్యం ఆరబోసుకునేందుకు బైపాస్ రోడ్డుకు ఓవైపు అనుమతి ఇప్పించాలని కోరుతూ మాజీ కౌన్సిలర్లు ప్రభుత్వం విప్ ఆది శ్రీనివాస్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. గత ఐదేళ్లుగా స్థలాలు లేక బైపాస్ రోడ్డుపైనే ధాన్యం ఆరబోస్తున్నామని, ఇప్పుడు కూడా బైపాస్ రోడ్డుకు ఓవైపు ధాన్య ఆరబెట్టేందుకు అనుమతి ఇప్పించాలని కోరినట్లు వారు తెలిపారు. ప్రతి గ్రామానికి ఐదెకరాల స్థలం కేటాయించి, కొనుగోలు కేంద్రాలకు అవసరమైన అన్ని ఏర్పాటు చేయాలని కోరినట్లు వారు పేర్కొన్నారు. మాజీ కౌన్సిలర్లు బొల్గం నాగరాజుగౌడ్, బుర్ర లక్ష్మి శంకర య్య, విలీన గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

హార్వెస్టర్ యజమానులతో సమావేశం



చందుర్తి: మండలకేంద్రంలోని రైతువేదికలో మండలస్థాయి అధికారులు, హార్వెస్టర్ యాజమానులతో వ్యవసాయాధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి దుర్గరాజు మాట్లాడుతూ వరికోత కోసే సమయంలో వరికోత మిషన్ ఆర్‌పీఎం 19 నుంచి 20 పైన ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భూపతి, రుద్రంగి మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు బొజ్జ మల్లేశం, ఐకేపీ ఏపీఎం పవన్‌కుమార్, ననుగుల, చందుర్తి సింగిల్ సీఈవో శ్రీవర్ధన్, ఆర్‌ఐలు శ్రీనివాస్, మహేందర్, ఏఈవోలు, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి

కోనరావుపేట: బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలను వినియోగించుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని కోనరావుపేట కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ దేవరాజు కోరారు. మండలంలోని ధర్మారంలో బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనరావుపేట బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అత్యధికంగా ఎనిమిది శాతం వడ్డీ ఇస్తున్నామన్నారు. సీనియర్ సిటిజన్లకు 8.5 శాతం వడ్డీ చెల్లిస్తున్నామన్నారు. బంగారంపై రుణాలను త్వరితగతిన ఇస్తున్నామని, గ్రాముకు రూ.7వేల చొప్పున రూ.25 లక్షల వరకు రుణాలు అందిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ శేఖర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ వెంగళ వెంకన్న, ప్యాక్స్ డైరెక్టర్ ఇప్ప రాములు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం తొలగింపు



గొల్లపల్లిలో విద్యుత్ స్తంభాన్ని తొలగిస్తున్న అధికారులు

సాక్షి స్పందన

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లిలోని బస్టాండ్ ప్రాంతంలో శిథిలావస్థలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని శనివారం సెస్ అధి కారులు తొలగించారు. ‘శిథిలా వస్థలో విద్యుత్ స్తంభం’ అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి స్పందించారు. కొన్ని రోజులుగా ప్రమాదకరంగా ఉన్న స్తంభాన్ని తొలగించాలని గ్రామస్తులు పలుసార్లు అధికారులకు విన్నవించారు. విద్యుత్ స్తంభం తొలగింపుపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి



ఇల్లంతకుంట: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మండలంలోని కందికట్కూర్ ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు వాటర్ బాటిల్స్ షూస్, టీషర్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, బాలనాగచారి, అనూష, హెచ్‌ఎం. రవీందర్ రెడ్డి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి



ఆనందం (ఫైల్)

వీర్నపల్లి: మండలంలోని గర్జనపల్లికి చెందిన గజ్జెల ఆనందం (43) గుండెపోటుతో మృతిచెందాడు. శనివారం ఆనందంకు వేకువజామున చాతిలో నొప్పి రావడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడికి భార్య సుజాత, ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు.

అనారోగ్యంతో కార్మిక ఉద్యమకారుడు ..



లచ్చన్న (ఫైల్)

సిరిసిల్ల: ముంబయి కార్మిక ఉద్యమకారుడు తాళ్లపల్లి లచ్చన్న (70) శనివారం మృతిచెందారు. ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌కు చెందిన లచ్చన్న నాలుగు దశాబ్దాల కింద ముంబయికి వలస వెళ్లారు. ఏఐఎఫ్‌టీయూతో పనిచేస్తూ అక్కడి కార్మిక ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాలకు చెందిన పేద వర్గాలకు చెందిన వారు ముంబైకి వలస వెళ్లేవారు. అక్కడ లేబర్ అడ్డాలు, కర్మాగారాల్లో శ్రమ దోపిడీకి గురై ఇబ్బంది ఎదుర్కొంటే వలసజీవులకు అండగా ఉన్నారు. కార్మిక ఉద్యమాలతో పాటు విప్లవోద్యమాల్లోనూ పనిచేశారు. మూడు దశాబ్దాల పాటు ముంబయి ప్రజాపోరాటాల్లో పనిచేసిన లచ్చన్న, తెలంగాణ సాధన ఉద్యమంలోనూ పోరాడారు. పదేళ్లుగా స్వగ్రామమైన హరిదాస్‌నగర్‌లో ఉంటున్నారు. అతనికి భార్య కౌసల్య, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతిచెందారు. ఆయన అంత్యక్రియలు ఆదివారం జరుగుతాయని గ్రామస్తులు తెలిపారు. లచ్చన్నకు నాటి కార్మిక ఉద్యమకారులు నివాళి అర్పించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్

తంగళ్లపల్లి: గ్రామ పంచాయతీ ట్రాక్టర్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో ఇద్దరు జీపీ కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బస్వాపూర్‌లో శనివారం రాత్రి గ్రామ పంచాయతీ ట్రాక్టర్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది దీంతో స్తంభం విరిగి తీగలు తెగిపడటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ట్రాక్టర్‌పై ఉన్న మల్టీపర్పస్ వర్కర్ దాచారం భూమయ్య (55), గొడిసెల అనితకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను పంచాయతీ కార్యదర్శి వేణు సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా భూమయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలించారు. మరో జీపీ కార్మికురాలు అనిత సిరిసిల్ల ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. భూమయ్యకు ఇద్దరు భార్యలు భాగ్యవ్వ, లావణ్య, కూతురు రేవతి ఉన్నారు. పోలీసులు వివరాలు సేకరించారు.



ముస్తాబాద్: ముస్తాబాద్–పోతుగల్ గ్రామాల మధ్య మానేరు కెనాల్‌పై వంతెన ప్రమాదకరంగా మారింది. నాలుగేళ్ల క్రితం రెండు గ్రామాల మధ్య రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. కానీ కెనాల్‌పై వంతెనను విస్తరించలేదు. దీంతో రెండు వైపులా వచ్చే వాహనాలు కెనాల్‌లో పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ అధికారులు కెనాల్‌పై ఇరుకుగా ఉన్న వంతెనను విస్తరణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
నిఖిల్, ఏఈ సెల్: 8106263804

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626



ముస్తాబాద్‌లో నిరసన తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు

బంద్ విజయవంతం



ఎల్లారెడ్డిపేటలో బంద్‌లో పాల్గొన్న ఐక్యవేదిక నాయకులు

వేములవాడఅర్బన్/వేములవాడరూరల్/ఎల్లారెడ్డిపేట: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ శనివారం చేపట్టిన బంద్ విజయవంతమైంది. వ్యాపార, వాణిజ్య సంస్థలు మూసివేశారు. విద్యాసంస్థలు తెరచుకోలేదు. ఆర్టీసీ బస్సులు డిపోల నుంచి బయటకు రాలేదు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత వాణిజ్య సంస్థలు తెరుచుకున్నాయి. బస్సులు సైతం నడిచాయి. ఎల్లారెడ్డిపేట మండలంలో బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బీసీ ఐక్యవేదిక నాయకులు వరుస కృష్ణహరి, కొండ రమేశ్, నంది కిషన్, బండారి బాల్‌రెడ్డి, రవి, కదిరే శ్రీనివాస్, గౌస్, దొమ్మాటి నర్సయ్య, ఖానాపురం లక్ష్మణ్ పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్, పోతుగల్, ఆవునూర్, గూడెంలలో బంద్ సంపూర్ణమైంది. బీసీ జేఏసీ బాధ్యులు సురేశ్, యాదగిరిగౌడ్, శీలం స్వామి, గుండెల్లి శ్రీను, గజ్జెల రాజు, వొరగంటి తిరుపతి, తోట ధర్మేందర్, స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి, యెల్ల బాల్‌రెడ్డి, సురేందర్‌రావు, క్రాంతి, రాజు పాల్గొన్నారు.

చందుర్తి: మండలంలోని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పెట్రోలింగ్ చేశారు.

కోనరావుపేట: మండలంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, ఏఎంసీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, సీపీఎం నాయకులు ఎగమంటి ఎల్లారెడ్డి, జవ్వాజి విమల, బీఆర్‌ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: బంద్‌కు సహకరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ ఫరూక్‌కు బీసీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు.

వీర్నపల్లి: బంద్‌లో మండల సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, మాజీ ఎంపీటీసీ అరుణ్ కుమార్, భూత శ్రీనివాస్, గడ్డం దేవయ్య, లెంకల లక్ష్మణ్, అన్నారం లక్ష్మీనారాయణ, రవి పాల్గొన్నారు.

రుద్రంగి: మండలంలోని అఖిలపక్షం నాయకులు ఆకుల గంగారాం, నంద్యాడపు వెంకటేశ్, దెగావత్ తిరుపతి, దయ్యాల నారాయణ, పడాల గణేశ్, గంగం మహేశ్, మంచె రాజేశం, దయ్యాల కమలాకర్, బోయిని రాజు, పెద్ది శ్రావణ్, గడ్డం రవీందర్, మీసాల రవీందర్, గడ్డం గణేష్, గసికంటి వెంకటి, మ్యాకల శ్రీకర్, కముటం గణేశ్, గోపరవేణి యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



బోయినపల్లి : బంద్‌లో పాల్గొన్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్, సీపీఎం, బీసీ సంఘాల నాయకులు



కోనరావుపేటలో దుకాణాలు బంద్ చేయిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పొంచి ఉన్న ప్రమాదం



సిరిసిల్ల అర్బన్: సిరిసిల్ల నుంచి కామారెడ్డి వెళ్లే ప్రధాన రహదారిపై నిర్మించిన డివైడర్ల మధ్యలో మున్సిపల్ అధికారులు హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడంతోపాటు, మొక్కలు పెంచారు. నిర్వహణ సరిగా లేకపోవడంతో డివైడర్ల మధ్యలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి హైమాస్ట్ లైట్లు వేసినా రోడ్డుకిరువైపులా విద్యుత్ వెలుగులు కనిపించడం లేదు. దీంతో సాయినగర్ నుంచి బీవైనగర్ కొంతవరకు లైట్లు వేసినా అంధకారం నెలకొంది. దీంతో ఆ ప్రాంతవాసులు, వాహనదారులు, ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లేవారు రాత్రివేళలో భయాందోళనకు గురవుతున్నామని వాపోతున్నారు. ప్రమాదాలు సైతం జరిగే అవకాశం ఉందని, ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చెట్లను తొలగించి విద్యుత్ లైట్లు కనిపించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఇద్దరిపై కేసు

తంగళ్లపల్లి: మండలకేంద్రంలో మద్యంతాగి పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించిన ఇద్దరు యువకులపై కేసు నమోదు చేశారు. ఎస్సై ఉపేంద్రచారి తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన అల్లెపు కనకరాజు, మల్లి శుక్రవారం రాత్రి మద్యంతాగి బైక్‌పై వస్తుండగా డ్రంకెన్ డ్రైవ్ చేస్తున్న పోలీసులు ఆపారు. పోలీసుల పట్ల దురుసుగా ప్రవరించి విధులకు ఆటంకం కలిగించారు. కానిస్టేబుల్ అబ్బాస్ ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.